ఆక్రమణలపై ఎందుకు స్పందించడం లేదు?

- అధికారుల తీరుపై నిలదీసిన కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు శెట్టి వీరవెంకటరాజేష్

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రహదారుల ఆక్రమణలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేష్ మండిపడ్డారు. స్థానిక కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. మొత్తం 31 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టగా వాటిపై చర్చించిన సభ్యులు 30 అంశాలకు ఆమోదం తెలిపారు. త్వరలో జరిగే పైడితల్లి పండగ నేపథ్యంలో రూ.64.60 లక్షలతో అభివృద్ధి పనులకు, గాంధీ పార్కులో రూ.28.41 లక్షలతో కళావేదిక నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే మరో 52 అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ ప్రధాన రోడ్లపై జరుగుతున్న ఆక్రమణలను పట్టించుకోని అధికారులు వార్డుల్లోకి వచ్చి చిన్న చిన్న ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో తోపుడుబండ్లపై వ్యాపారాలు సాగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు రోడ్లు ఆక్రమించడంతో పార్కింగ్ సమస్యతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయిందని, ప్రధాన రోడ్లపై స్టాళ్లు పెట్టి విక్రయిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

పీ–4 జాబితాలో ఉద్యోగులు, కోటీశ్వరులా?

ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న పీ–4 కార్యక్రమంపై స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకపోవడాన్ని ఫ్లోర్ లీడర్ రాజేష్ తప్పుబట్టారు. ఇష్టారాజ్యంగా జాబితాలు తయారు చేశారని మండిపడ్డారు. జాబితాల్లో బ్యాంక్ ఉద్యోగులు, కోటీశ్వరులను ఎలా ఎంపిక చేస్తారని ధ్వజమెత్తారు. సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు మార్గదర్శకులా అని ప్రశ్నించారు. పేదలకు ఇవ్వాల్సిన పథకం కాకుండా డబ్బున్న వారిని మరింత డబ్బున్న వారిగా తయారు చేసేలా ఎంపిక ప్రక్రియ ఉందన్నారు. ఫ్లెక్సీల విషయంలోనూ అధికార పార్టీ వారికి అధికారులు వత్తాసు పలికేలా వ్యవహరించడం సరికాదన్నారు.

ఆక్రమణలు జరగకుండా చూడాలి..

ప్రత్యేకంగా ఒక కమిటీ వేసి ఆక్రమణలు జరగకుండా చూడాలని కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. పోలీసుల సహకారంతో ఆక్రమిత ప్రాంతాల్లో బండ్లు సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, కేఎల్ పురం, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఆక్రమణలు తీయడం జరిగింది, మరిన్ని త్వరలో తొలగిస్తామని అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తిలు పేర్కొన్నారు. బాదం బళ్ల వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సు వేయడంతో పాటు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి తెలిపారు. అమెరికా లాంటి దేశంలో కూడా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను గౌరవించి విగ్రహాలు కడుతుంటే ఆయన పేరు మీద నిర్మిస్తున్న అంబేడ్కర్ భవన నిర్మాణం పూర్తి చేయకపోవడం సరికాదని స్టాండింగ్ కమిటీ సభ్యురాలు రేగాన రూపావతి అన్నారు. త్వరగా భవనం నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఏడాది క్రితం వార్డుకి రూ.20 లక్షలు అభివృద్ధి పనుల కోసం కేటాయించగా ఇప్పటికీ పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని మరో సభ్యుడు జీవీ రంగారావు ప్రశ్నించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, ఎస్.నారాయణస్వామి, అసిస్టెంట్ కమిషనర్ కిల్లాడ అప్పలరాజు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా!



సంగీత వాయిద్యాల ప్రదర్శనలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: స్థానిక పీఎం శ్రీకేంద్రియ విద్యాలయంలో విశాఖ క్లస్టర్ లెవల్‌లో ఏక్తా సర్వ్ పోటీలు గురువారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. క్లస్టర్ పరిధిలోని 11 కేంద్రియ విద్యాలయాల విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్, గ్రూప్ సింగింగ్, సోలో డ్యాన్స్, సంప్రదాయ కథావర్ణన యాక్షన్, వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, గ్రూప్ ప్రదర్శన, ఆన్ స్పాట్ పెయింటింగ్, లోకల్ ఆర్ 2డీ/3డీ, విజువల్ ఆర్ 2డీ, ఆర్టిఫాక్ట్స్ అండ్ ప్రాజెక్ట్స్ ప్రదర్శన విభాగాల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లోని విజేతలు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ దిలీప్‌మోడీ చేతులమీదుగా విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.

క్లుప్తంగా

వర్షపు నీటితో ఇబ్బందులు



కళాశాల ముఖద్వారం వద్ద నిలిచిన వర్షపు నీరు

పూసపాటిరేగ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు, అటుగా వెళ్లే పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు కింద నుంచి తూములు ఏర్పాటుచేసి వర్షపు నీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆక్రమణలో సాగునీటి కాలువ



ఆక్రమణకు గురైన పూనచెరువు కాలువ

పూసపాటిరేగ: స్థానిక జగనన్న కాలనీ సమీపంలో పూనుచెరువు సాగునీటి కాలువ ఆక్రమణకు గురైంది. ఇరువైపులా కాలువను కప్పేశారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి. దీనిపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువలో ఆక్రమణలు తొలగించి సాగునీటి కష్టాలు తీర్చాలని రైతులు కోరుతున్నారు. లేదంటే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు.

17న జర్నలిస్టులకు సత్కారం



మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు

విజయనగరం: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 17వ తేదీన సీనియర్ జర్నలిస్టులను సత్కరిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే(ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్) రాష్ట్ర నాయకుడు పీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక జీఎస్ఎస్ఆర్ హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగే ఈ కార్యక్రమంలో తటస్థులకు కూడా యూనియన్‌లో సభ్యత్వం కల్పించాలని యూనియన్ రాష్ట్ర నాయకులు నిర్ణయం తీసుకున్నారన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పోరాడేందుకు జర్నలిస్టులకు సాయంగా చేరే తటస్థులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తోందని, జర్నలిజం రంగంలో 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న యూనియన్ సభ్యులను సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర మహాపాత్రో పాల్గొన్నారు.

కూటమివి కక్షపూరిత రాజకీయాలు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు



కోరుకొండలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



21వ డివిజన్‌లో కూటమి మోసాలు వివరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, శ్రావణి

విజయనగరం: కూటమి కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని, ఇది తగదని వైఎస్సార్ సీపీ విజయనగరం మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా పెన్షనర్లు, ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు డోల మన్మథకుమార్ అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోరుకొండ గ్రామంలో గురువారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వ మోసాలు వివరించారు. ఎన్నికలకు ముందు లేనిపోని హామీలతో ప్రజలను ఊదరగొట్టి, ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు విస్మరించారని విమర్శించారు. రెండు, మూడు పథకాలు అరకొరగా అమలు చేసి, చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పథకాల్లోనూ ఎంతోమంది లబ్ధిదారులు నష్టపోయారన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ తదితర హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. హామీల అమలు, ప్రభుత్వ మోసాలపై ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు బనాయించి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ అధికారాన్ని ఉపయోగించుకుని, చేసిన అరాచకాలను రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగడం లేదని, వారి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఇష్టం వచ్చినట్లు కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలని లేకుంటే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కునుకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చంద్రబాబుకు అలవాటు..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు పాల్గొని, ఏడాది కాలం దాటినా హామీలన్నీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఎన్నికలప్పుడు చంద్రబాబు అబద్ధాలతో అధికారం పొందడం, ఆ తర్వాత మోసం చేయడం ఆయనకు అలవాటు అయిపోయిందని వారు విమర్శించారు. ఇలాంటి మోసాలు చేసే నాయకులను మరోసారి నమ్మవద్దని ప్రజలను కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, శానిటేషన్ కిట్లను సర్పంచ్ పతివాడ అప్పన్న గురువారం అందజేశారు. పంచాయతీ సాధారణ నిధులతో సామాగ్రిని కొనుగోలుచేశామని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి లెంక తవుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భవానీ, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సాగు సులభం



భోగాపురంలో యాంత్రీకరణ సాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: యాంత్రీకరణ పద్ధతిలో సాగు సులభమని, రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగుచేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. భోగాపురంలోని వరి క్షేత్రంలో యంత్రాలతో వరినాట్లు వేసే కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత అధికంగా ఉందని, దీనిని అధిగమించేందుకు యాంత్రీకరణ సాగు ఉత్తమమన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ హైమావతి, నాయకులు వందనాల రమణ, రామకృష్ణారెడ్డి, రాంబాబు, జగదీష్ పాల్గొన్నారు.

మానాప్రగడకు గ్రంథ నీరాజనం



శేషసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ సుబ్బారావు తదితరులు

విజయనగరం టౌన్: నగర పరిధిలోని కొత్తపేట బుక్కావీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మధుర వచస్వి దివంగత మానాప్రగడ శేషసాయి జయంతి గురువారం సాయంత్రం నిర్వహించారు. వాగ్దేవీ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి ఆధ్వర్యంలో కాశీపతిరావు గ్రంథనీరాజనం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పీవీఎల్ సుబ్బారావు పాల్గొని, మానాప్రగడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పైడితల్లి అమ్మవారి జాతరలో తన వాక్ పటిమతో అమ్మవారిని మన కళ్లముందు సాక్షాత్కరింపజేసేవారని కొనియాడారు. ఆయనను మననం చేసుకోవడం మనందరి బాధ్యతని గుర్తుచేశారు. కార్యక్రమంలో రచయిత్రి చివుకుల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: మానాప్రగడ శేషసాయి జయంతి పురస్కరించుకుని, గురజాడ పాఠశాలలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్త, పద్యతిలక రాఘవేంద్రరావుకు మానాప్రగడ శేషసాయి పురస్కారం ప్రదానం చేసి, సత్కరించారు. అంతకుముందు శేషసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాక్సిలరేటర్స్ అండ్ ఇంక్యుబేషన్‌పై అవగాహన సదస్సు



దివాకర్ వాడపల్లిని సన్మానిస్తున్న యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'యాక్సిలరేటర్స్ అండ్ ఇంక్యుబేషన్' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఎల్‌జీవీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ దివాకర్ వాడపల్లి మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సపోర్ట్, ఫండింగ్ అవకాశాలు, స్టార్టప్‌ల అభివృద్ధి వ్యూహాలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు, అధ్యాపకులంతా తమ ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే వ్యాపారాలుగా మార్చుకోవచ్చని ప్రోత్సహించారు. అనంతరం ఆయనను యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ డాక్టర్ జీజే నాగరాజు, ఇంక్యుబేషన్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.